క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్సీ తోట పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: పట్టణంలోని ఏడో వార్డు, ఎస్సీ పేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొడమంచిలి భీమరాజు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆయన కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పరామర్శించారు. భీమరాజు మృతుకి గల కారణాలు అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో భీమరాజు సోదరుడు కొడమంచిలి భాస్కరరావు , 29వ వార్డు కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, తణుకు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందు మృతికి సంతాపం

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శీలం గోవిందు మృతికి ఆ పార్టీ రాష్ట్ర నాయకులు వేగుళ్ళ పట్టాభిరామయ్య చౌదరి, రెడ్డి రాధాకృష్ణ (రాజుబాబు), పలు విభాగాల నాయకులు పుట్టా కృష్ణమూర్తి, పసలపూడి శ్రీనివాస్, పెంకే గంగాధర్, సూరంపూడి సత్య ప్రసాద్, కట్టా మురళి, సంతాపం వ్యక్తం చేశారు. పార్టీ అభ్యున్నతికి గోవిందు చేసిన సేవలు మరువలేనివి అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

ద్రాక్షారామలో ఆక్రమణ తొలగింపు



ద్రాక్షారామలో కిళ్లీ బడ్డీని తొలగిస్తున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ పంచాయతీ ఆవరణలో ఆక్రమించి ఏర్పాటు చేసిన కిళ్లీ బడ్డీని గురువారం పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఆక్రమణదారుడు దుర్గాప్రసాద్ ఆక్రమణ తొలగింపునకు సహకరించినట్టు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఆ క్రమణదారుడితో మాట్లాడి తొలగింపుకు ఒప్పించిన ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్‌కు గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ కృతజ్ఞతలు తెలియజేశారు.

సాగునీటి సమస్యలు పరిష్కరించాలి

కాజులూరు: మండలంలోని కాలువ శివారు భూముల్లో తలెత్తిన సాగునీటి సమస్యలను సరి చేసేందుకు అధికారులు కృషి చేయాలని వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ అన్నారు. అయితపూడిలో తలెత్తిన సాగునీటి ఇబ్బందులపై పలువురు స్థానిక రైతులు గురువారం వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ వద్ద మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరంగి కెనాల్‌పై వెల్ల లాకుల నుంచి కందులపాలెం, ఉండూరు మీదుగా మండలంలోని పెనుమళ్ల, తనుమళ్ల, అయితపూడి గ్రామాలకు పంట కాలువ ద్వారా సాగునీరు సరఫరా కావాల్సి ఉందన్నారు. అయితే అయితపూడి కాలువ శివారు భూములు కావడంతో నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి శివారు భూములకు సైతం సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

హామీల అమలుకు కృషి

కపిలేశ్వరపురం: ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండలంలోని అంగర గ్రామంలో సర్పంచ్ వాసా కోటేశ్వరరావు అధ్యక్షతన గురువారం ఇది మంచి ప్రభుత్వం పేరుతో ప్రజావేదిక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ సామాజిక పింఛన్ల పెంపుతో సామాన్యులకు ఆసరాగా ప్రభుత్వం నిలిచిందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్, ఎంపీడీఓ కొండలరావు, తహసీల్దార్ చిన్నారావు, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, నాయకులు పుత్సల శ్రీనివాస్, పువ్వల చిట్టిబాబు, నెక్కంటి శ్రీరాంజీ, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిరుత సంచారంపై కలవరం

ఆలమూరు: చిరుతపులి ఏ క్షణంలోనైనా మండలంలోకి ప్రవేశిస్తుందేమోనని లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆలమూరు మండలానికి సమీపంలోనే ఉన్న కడియం మండలంలోని కడియపులంక, బుర్రిలంక నర్సరీల్లో చిరుత సంచరిస్తుందనే సమాచారంతో మండల వాసులంతా కలవరం చెందుతున్నారు. గతంలోనూ జనారణ్యంలోకి వచ్చిన చిరుతపులి గౌతమి గోదావరి తీరం వెంబడి రావులపాలెం, కొత్తపేట మండలాల మీదుగా ముమ్మిడివరం చేరుకుని అక్కడ అటవీశాఖ అధికారులకు చిక్కిన విషయాన్ని మండల వాసులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం బుర్రిలంకకు మండలంలోని మడికి గ్రామానికి కేవలం ఏడు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో లంక గ్రామాల వెంబడి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో అనర్థాలు

- పెరిగిపోతున్న వినియోగం
- పేరుకుపోతున్న చెత్త
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పర్యావరణ వేత్తలు



సత్యవాడ రహదారి పక్కనే వేసిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు

కె.గంగవరం: ప్లాస్టిక్ వాడకం యథేచ్ఛగా సాగుతోంది. పర్యావరణానికి, మన ఆరోగ్యానికి ముప్పు అని తెలిసినా ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. ప్లాస్టిక్ బదులు క్లాత్ సంచులు వాడాలని ప్రభుత్వం చెబుతున్నా పట్టించుకోకుండా ప్లాస్టిక్ వస్తువులు, క్యారీ బ్యాగులనే ఉపయోగిస్తున్నాము. దీంతో విచ్చలవిడిగా పేరుకుపోయిన వ్యర్థాలన్నీ గ్రామ శివారులోని డంపింగ్ యార్డులకు చేరుతున్నాయి. కొండల్లా పేరుకుపోతున్న వీటిని వదిలించే క్రమంలో నిప్పు పెడుతున్నారు. దీంతో తీవ్రమైన వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. ఇంకా వాతావరణం వేడెక్కి కాలుష్యం మరింత పెరిగి చివరికి మన ఆరోగ్యాన్ని మనమే ముప్పు తెచ్చుకొంటున్నాం . ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకున్నప్పటికీ అమలు చేయాల్సిన యంత్రాంగం మాత్రం నిర్లక్ష్యం చూపుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూరగాయాలు, టిఫిన్లు, పాల ప్యాకెట్లు, డిస్పోజబుల్ పేట్లు, ఇతర ఆహార పదార్థాలు ఇళ్లకు తెచ్చుకోవడానికి ఇలా ఉదయం నుంచి రాత్రి వరకూ ప్రతీ అవసరంలోనూ ప్లాస్టిక్ వస్తువులనే వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు.

రోజూ 30 టన్నుల చెత్త

రామచంద్రపురం నియోకజవర్గంలోని కె.గంగవరం, రూరల్, కాజులూరు, పట్టణంలోని వార్డులతో సహా ప్రతి రోజు సుమారు 30 టన్నులకుపైగా చెత్త పోగవుతుందని ఒక అంచనా. ఇందులో సుమారు 3 నుంచి 5 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి. తడి, పొడి చెత్త విషయంలో అలసత్వం వహిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించొద్దన్న ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు.

చెత్తకు నిప్పు పెడితే ప్రమాదమే

ప్లాస్టిక్ కాలిస్తే మరింత ప్రమాదమని హెచ్చరిస్తున్నప్పటికీ చెత్తతో పాటే ప్లాస్టిక్‌ను కూడా తగడబెడుతున్నారు. ఈ ప్రక్రియతో విపరీతమైన వాయు కాలుష్యం ఏర్పడుతోంది. శ్వాస సంబంధిత వ్యాధులు వస్తున్నాయి. వ్యాధులతో ఇబ్బంది పడే వారి సంఖ్య పెరగడానికి ప్రధాన కారణాల్లో ఇది ముఖ్యమైంది. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంపై ఎవరికి వారు అవగాహన పెంచుకోవాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ తగలపెట్టకుండా ప్రభుత్వ యంత్రాంగం కూడా చర్యలు చేపట్టాలని ఇందుకు ప్రజా ప్రతినిధులు, నాయకులు చొరవ చూపాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన అవసరం



వల్లూరులో సీమంతం చేస్తున్న అధికారులు

కపిలేశ్వరపురం: పౌష్టికాహారం పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని మండలంలోని వల్లూరులో గురువారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవంలో పాల్గొన్న వక్తలన్నారు. సర్పంచ్ దాసి మీనాకుమారి అధ్యక్షతన గ్రామంలోని గర్భిణులకు సీమంతం చేశారు. ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ పి.వెంకటలక్ష్మి, అచ్యుతాపురం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ సీహెచ్ గోపాలకృష్ణ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టికాహార ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ ప్రముఖులు వల్లూరి వీరబాబు, గుణ్ణం సుబ్బరాజు, ముత్యాల శ్రీధర్, పుల్లాజీ పాల్గొన్నారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్రకు నేడు ప్రత్యేక బస్సు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ డిపో నుంచి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్ర స్పెషల్ కోసం ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ, శ్రీకాళహస్తి, కాణిపాకం, అద్దగిరి ఆంజనేయస్వామి దేవాలయం , శ్రీపురం(లక్ష్మీ దేవి బంగారు ఆలయం), అరుణాచలం, కంచి, తిరుత్తని మొత్తం 8 క్షేత్రాలను సందర్శించి తిరిగి సోమవారం ఉదయం రామచంద్రపురం డిపోకు చేరుకుంటుంది. వివరాలకు 95503 21426, 73829 12064, 99592 25536, 73829 12083, 99489 39888 నంబర్లపై డిపో కార్యాలయ సమయాల్లో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం: పట్టణంలోని 33–11 కేవీ చోడవరంకు వెళ్లే సబ్‌స్టేషన్ పరిధి/ లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు తెలిపారు. మండలంలోని నరసరావుపేట, ఓదూరు, యనమదల, ఆరికిరేవుల, ఏ అగ్రహారం ప్రాంతాలకు విద్యుత్ సరఫరాఉండదన్నారు.

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ వెంకటాయపాలెం ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ శీలం యేసురాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.విజయానంద్ ఆదేశాల మేరకు వెంకటాయాపాలెం ఫీడర్ లైన్‌లో చెట్ల కొమ్మలు నరికివేత, మరమ్మతులు చేపడుతుండడంతో తోటపేట, అన్నాయిపేట, వేగాయమ్మపేట, వెంకటాయపాలెం, దాసరపాడు, యల్లమ్మపంపు, చిన్నంపేట గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

మండపేట: విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు కోసం పట్టణంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ కె.రత్నాలరావు, ఏడీఈ సీహెచ్ శ్రీధర్ గురువారం తెలిపారు. దాంతో కేపీ రోడ్డు వద్ద నుంచి మారేడుబాక వంతెన, ఇందిరాగాంధీ బైపాస్ రోడ్డు, న్యూ కాలనీ, కొండపల్లివారి వీధి, రజకపేట, అరుంధతీయపేట, బురుగుంట చెరువు, రాజారత్న రోడ్డు, బ్యాంక్ కాలనీలోని అన్ని వీధుల్లోనూ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

రాయవరం, అనపర్తి, బిక్కవోలు మండలాల్లో..

రాయవరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ రత్నాలరావు గురువారం తెలిపారు. ఈ సమయంలో రాయవరం, వి.సావరం, వెదురుపాక, నదురుబాద, లొల్ల, సోమేశ్వరం, పసలపూడి, మాచవరం, అనపర్తి మండలం మహేంద్రవాడ, బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు హెల్త్ కిట్ల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు హెల్త్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ వెంకటరమణ

రాయవరం: స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు గురువారం ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ చేతుల మీదుగా హెల్త్ కిట్లు అందజేశారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా వాటిని అందజేశారు. చాణక్య ఆస్పత్రి అధినేత డాక్టర్ జీఎస్ఎస్ రెడ్డి సౌజన్యంతో ప్రతి పారిశుధ్య కార్మికుడికి సబ్బులు, నూనె, సర్ఫ్ పౌడర్ తదితర సామగ్రితో కూడిన హెల్త్ కిట్లు అందజేశారు. ఒక్కో కార్మికునికి ఆరు నెలలకు ఆరేసి కిట్ల వంతున 20 మంది కార్మికులకు 120 కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు వుండవిల్లి రాంబాబు, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పట్టణంలో పారిశుధ్యం క్షీణించింది

- కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఆందోళన
- తొమ్మిది అంశాలకు ఆమోదం



రామచంద్రపురం కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం: మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాధ్యతా రాహిత్యం కారణంగా పారిశుధ్యం క్షీణించిందని, ఆయన ఒకే ఒక్క వార్డుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా వ్యవహరిస్తున్నారని, మున్సిపల్ వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, మున్సిపల్ కౌన్సిల విప్ వాద్రేవు సాయిప్రసాద్ కౌన్సిల్ సమావేశంలో ధ్వజమెత్తారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో గురువారం రెండు కౌన్సిల్ అత్యవసర సమావేశాలను ఒకే సారి నిర్వహించారు. మొదటి అత్యవసర సమావేశంలో 7 అంశాలను ప్రవేశపెట్టగా వాటికి కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. గత కౌన్సిల్ సమావేశంలో సభ్యులు తిరస్కరించిన మున్సిపల్ షాపులు అద్దె బకాయిలు చెల్లించిన వారిపై కోర్టుకు వెళ్లే అంశానికి ఈ సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపారు.

పట్టణంలోని 28 వార్డుల్లోను సాంకేతిక లోపంతో ఒక ఇంటికి రెండు పన్నులు వేస్తూ డిమాండ్ నోటీసులను ఇస్తున్నారు. వీటిని రద్దు చేయాలని సూచిస్తూ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కాగా రెండో అత్యవసర సమావేశంలో రెండు అంశాలను సభ్యుల ఆమోదానికి తీసుకువచ్చారు. ఇందులో పారిశుధ్య కార్మికులు 20 మందిని రోజు వారి వేతనానికి నెల రోజుల పాటు పొడిగించేందుకు కౌన్సిల్ ఏకగ్రీవగా తీర్మానం చేసింది. కాగా దీనిపై కొంత మంది సభ్యులు అభ్యంతర వ్యక్తం చేసిన చివరకు దీనికి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ వాద్రేవు సాయిప్రసాద్, వైస్ చైర్మన్ కోలమూరి శివాజీలు మాట్లాడుతూ పట్టణంలో 20 మంది కార్మికులను తాత్కాలికంగా వేసుకున్నా పారిశుధ్యం ఎక్కడిక్కడ క్షీణిస్తోందని చైర్ పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ పరిస్థితుల్లో పొడిగించడం ద్వారా కలిగే లాభమేమిటని ప్రశ్నించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, పారిశుధ్య కార్మికులు కేవలం 3వ వార్డుకే పరిమితమవుతున్నారని మండిపడ్డారు. పట్టణంలో 28 వార్డులుంటే కేవలం ఒకే వార్డుకు పారిశుధ్య కార్మికులను పరిమితం చేస్తు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. జన సంచారం అధికంగా ఉండే చోట్ల పారిశుధ్యంపై దృష్టి పెట్టాన్నారు. ప్రతీ వార్డులోను ఎటువంటి పక్షపాతం లేకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్‌సభ్యులు, సబ్బంది పాల్గొన్నారు.

వివాదాస్పదంగా ఉపాధ్యాయుల సర్దుబాటు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం పట్టణం, రామచంద్రపురం రూరల్ మండలాల్లోని ఉపాధ్యాయుల సర్దుబాటు వ్యవహారం వివాదాస్పదంగా మారింది. రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలల్లో 26 మందిని, రూరల్ మండలంలోని పాఠశాలల్లో ఆగురిని మిగులు ఉపాధ్యాయులుగా గుర్తించారు. మొత్తంగా 32 మంది ఉపాధ్యాయులను మిగులు ఉపాధ్యాయులుగా ఉండడం, వారిని ఏవిధంగా సర్దుబాటు చేయాలన్న దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన నిబంధనలు లేకపోవడంతో ఏదో విధంగా సర్దుబాటు చేయాలని ఎంఈఓ ప్రయత్నించడంతో ప్రస్తుతం వివాదంగా మారింది. ఇప్పటికే రెండు సార్లు ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్ మిగులు ఉపాధ్యాయులను, ఉపాధ్యాయ సంఘాల నాయకులను సమావేశపరిచి చర్చించినా వారి మధ్య సమన్వయం లేకపోవడంతో రెండు సార్లూ వాయిదా వేశారు.

వివాదానికి కారణం

మిగులు ఉపాధ్యాయులు 32 మందిలో 15 మందిని పట్టణ పరిధిలోని మున్సిపల్ హైస్కూళ్లలో సర్దుబాటు చేయాలని ఎంఈఓ నిర్ణయించారు. కాగా ఈ నిర్ణయం వివాదానికి కారణమైంది. మొత్తం మిగులు ఉపాధ్యాయులను ప్రాథమిక పాఠశాలలకు సర్దుబాటు చేయాల్సి ఉండగా 15 మందిని ఉన్నత పాఠశాలల్లో ఏ విధంగా సర్దుబాటు చేస్తారంటూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో 3, 4, 5 తరగతులతో పాటు ఉన్నత పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు అక్కడనే కొనసాగుతున్నారని, వారిని వెంటనే ప్రాథమిక పాఠశాలలకు పంపాలని ఆ తరువాతనే సర్దుబాటు అంశాన్ని చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై ఎంఈఓ వివరణ కోరగా సర్దుబాటు విషయంలో ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరుగుతున్నాయని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు.

డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు కృషి

మున్సిపల్ చైర్ పర్సన్ దుర్గారాణి



ఆలమూరు రోడ్డులో పూడిక తీస్తున్న కార్మికులు

మండపేట: పట్టణంలో మురుగునీటి పారుదల సక్రమంగా జరిగేందుకు డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి తెలిపారు. స్థానిక ఆలమూరు రోడ్డులోని డ్రైనేజీల్లో గురువారం పూడిక తీత పనులు చేపట్టారు. స్థానిక విక్టరీ బజార్ వద్ద నుంచి అయ్యప్పస్వామి ఆలయం వరకూ ఈ పనులు జరుగుతాయని ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు తెలిపారు. నలభై మంది ప్రైవేట్ కార్మికులను తాత్కాలికంగా నియమించి డ్రైన్లను శుభ్రం చేయిస్తున్నామని చెప్పారు. తీసిన పూడికను ట్రాక్టర్ల ద్వారా వెంటనే తొలగిస్తున్నామన్నారు. కాగా మసీదు కాంప్లెక్స్ వద్ద డ్రైన్లు, 24వ వార్డు టౌన్ హాలు బైపాస్ రోడ్డుకు రెండు వైపులా ఉన్న డ్రైన్లు పూర్తిగా సిల్టుతో పూడుకుపోయాయి. చిన్నపాటి వర్షం వచ్చినా డ్రైన్లు పొంగి రోడ్ల మీదకు మురుగు వచ్చి పడుతోందని స్థానికులు చెబుతున్నారు. దీని వల్ల విపరీతంగా దుర్గంధం కూడా వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మున్సిపల్ అధికారులు, చైర్‌పర్సన్ దుర్గారాణి స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో శానిటరీ మేస్త్రీలు సందక ఉమామహేశ్వరరావు, కణితి వెంకట్రావు, సచివాలయ సెక్రటరీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్ నియామకం హాస్యాస్పదం

షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అలీఖాన్‌బాబా



మండపేట: వక్ఫ్ బోర్డు చైర్మన్ నియామకంలో కూటమి ప్రభుత్వం వక్ఫ్ బోర్డు నిబంధనలను తుంగలోకి తొక్కిందని షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీఖాన్‌బాబా విమర్శించారు. వైఎస్సార్ సీపీ పట్టణ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వక్ఫ్ బోర్డుపై ఆధిపత్యం చెలాయించేందుకు నెల్లూరుకు చెందిన అజీజ్ అనే వ్యక్తిని బోర్డు చైర్మన్‌గా నియమించిందన్నారు. జీవో ఎంఎస్ నంబర్ 47 ప్రకారం బోర్డులో సభ్యులుగా 11 మంది కొనసాగుతారని చెప్పారు. నిబంధనల ప్రకారం ఆ సభ్యులంతా కలసి బోర్డు చైర్మన్‌ను ఎన్నుకుంటారని షేక్ అలీఖాన్‌బాబా తెలిపారు. ఇందుకు భిన్నంగా బోర్డు చైర్మన్‌ను నియమించే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదన్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని చూస్తుంటే వక్ఫ్ బోర్డును తప్పుదోవ పట్టించినట్టు అర్థం అవుతోందన్నారు.తమ ప్రభుత్వంలో కొత్తగా 20 కార్పొరేషన్లు, చైర్మన్‌ను ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకోవడానికే వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా అజీజ్ పేరు ప్రకటించారని ఎద్దేవా చేశారు. కోర్టు పరిధిలో ఉన్న ఈ అంశాన్ని పట్టించుకోకుండా వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను నియమించడం కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని బాబా హెచ్చరించారు.

ఏకాగ్రత, సత్ప్రవర్తన జీవితంలో భాగం కావాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసచౌదరి

రాయవరం: విద్యార్థి దశ నుంచే ఏకాగ్రత, సత్ప్రవర్తన పెంపొందించుకోవాలని విశ్వమానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి సూచించారు. స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం సంపూర్ణ ఆరోగ్యం–యోగాసాధన అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు ఈ శ్రీనివాసచౌదరి శిక్షణ ఇచ్చారు. ప్రతి విద్యార్థి విజయం వైపు పయనించాలంటే ఏకాగ్రత పెంచుకోవాలన్నారు. యోగా సాధన ద్వారా మనో నిగ్రహ శక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే ధ్యానం, వ్యాయామం , యోగా చేయడం వలన సానుకూల దృక్పథాలు అలవడతాయన్నారు. పెరటితోట, గో సంరక్షణ వంటి పనులను ప్రతి వారు స్వయంగా చేపట్టాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎం వీఎస్ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన నియోజక వర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు



రాయవరంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రాయవరం: స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన మండపేట నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న పోటీలు ప్రారంభమయ్యాయి. 25న జరగాల్సిన పోటీలకు వర్షం కారణంగా అంతరాయం కలిగింది. గురువారం బాలికల పోటీలను పాఠశాల హెచ్‌ఎం వీఎస్ సునీత ప్రారంభించారు. మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలకు చెందిన 300 మంది క్రీడాకారులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా పోటీలను నిర్వహించారు. 24న బాలురకు, 26న బాలికలకు వేర్వేరుగా నిర్వహించిన పోటీల్లో వివిధ క్రీడాంశాల్లో జిల్లా స్థాయికి క్రీడాకారులను ఎంపిక చేశారు. కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఏడు అంశాల్లో బాలురు, బాలికల విభాగాల్లో నియోజకవర్గ స్థాయి క్రీడాకారులను ఎంపిక చేసి, జిల్లా స్థాయికి పంపించారు. పీడీ, పీఈటీ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు నల్లమిల్లి అప్పారెడ్డి సారథ్యంలో ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి అధ్యక్షుడు సిద్ధాంతపు వీర్రాజు, సెక్రటరీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించగా, మూడు మండలాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు 48 మంది ఎంపిక

మండలంలోని సోమేశ్వరం శ్రీమతి ద్వారంపూడి మంగయ్యమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 48 మంది క్రీడాకారులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్‌ఎం ఆర్.దయామణి గురువారం విలేకరులకు తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, చెస్, అథ్లెటిక్స్ విభాగాల్లో 48 మంది క్రీడాకారులు ఎంపికైనట్టు ఆమె తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు 48 మంది క్రీడాకారులను, క్రీడాకారులకు కోచింగ్ ఇచ్చిన పాఠశాల వ్యాయామో పాధ్యాయుడు జగదీష్‌ను సర్పంచ్ ఆరిఫ్, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల అప్పారావు, ఎస్ఎంసీ చైర్మన్ జె.గణేశ్, మాజీ సర్పంచ్ వైఆర్‌కే పరమహంస, ఉపాధ్యాయులు అభినందించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



సామూహిక సీమంతాల కార్యక్రమంలో మంత్రి సుభాష్ తదితరులు

రామచంద్రపురం: ఆరోగ్యవంతమైన శిశువుల జననం కోసం గర్భిణులు ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. పట్టణం లైయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో గురువారం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాలు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యూట్రిషన్ స్టాల్స్‌లో ప్రదర్శనకు ఉంచిన పౌష్టికాహార పదార్థాలను ఆయన పరిశీలించి గర్భిణులకు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ గర్భిణులు బాలింతలలో రక్తహీనతను నివారించే పౌష్టికాహారం ప్రాముఖ్యతను తెలియజేయడమే పౌష్టికాహార మాసోత్సవాల ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మంత్రి అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం సిడిపిఓ వరాహాలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

టి.మామిడాడ రహదారిని పునర్నిర్మించాలి



శిథిలావస్థకు చేరిన టి.మామిడాడ రహదారి

కాజులూరు: టి.మామిడాడ రహదారి శిథిలావస్థకు చేరడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సుమారు 12 సంవత్సరాల క్రితం నాబార్డు నిధులు రూ.70 లక్షలతో జగన్నాథగిరి, ఆర్యావటంల మధ్య తర్లంపూడి, టి.మామిడాడల మీదుగా రహదారి నిర్మాణం చేపట్టారు. అయితే నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాల పాటించక పోవడంతో నిర్మించిన కొన్ని నెలలకే రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. రోడ్డు మొత్తం రాళ్లు లేగిసిపోయి మధ్యలో పెద్ద,పెద్ద గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని మాజీ సర్పచ్ నురుకుర్తి శ్రీనివాసు, స్థానిక నాయకులు అణసూరి శివన్నారాయణ, అణసూరి శ్రీనివాసు, రాంబాబు, స్థానికులు కోరుతున్నారు.